

మొబైల్ హంట్ ఉందిగా..
గతంలో మీ సెల్‌ఫోన్ పోతే ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేదు. 'మొబైల్ హంట్' సేవలను వాడుకుంటే మీ ఫోన్ తిరిగొస్తుంది.
8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,860
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,555
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,722
నవర (8 గ్రా) -	రూ.45,776

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.5 /31.8
జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో 51 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

ఏఓలకు పదోన్నతులు

- ఎంపీడీఓలుగా నియామకం, ఇతర జిల్లాలకు బదిలీ

నెల్లూరు(పొగతోట): పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి వివిధ మండలాల్లో పరిపాలనాధికారులుగా, ఈఓపీఆర్డీలుగా పనిచేస్తున్న వారికి అడహక్ పద్ధతిలో ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఓలకు సంబంధించి ఎస్.జగదీష్‌ను నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లాకు, డీవీ నరసింహారావును తిరుపతికి, కె.షాలెట్‌ను తిరుపతికి, పి.ప్రసన్నకుమారి, వైవీ నాగేశ్వరప్రసాద్‌ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఈఓపీఆర్డీలకు సంబంధించి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న ఏవీ కృష్ణామోహన్‌రావు, రంగసుబ్బారాయుడును నెల్లూరుకు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును నెల్లూరుకు, నెల్లూరులో పనిచేస్తున్న ఎస్.వసుంధర, బి.కల్పన, శ్రీనివాసులురెడ్డి, జలజాక్షిని ప్రకాశం జిల్లాకు బదిలీలు చేశారు.

పెన్నాలో పడి వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): ప్రమాదవశాత్తు పెన్నా నదిలో పడి ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన నెల్లూరు రంగనాయకుల స్వామి గుడి స్నానాలఘాట్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట లక్ష్మీపురం చాకలివీధిలో ఆర్టీసీ డ్రైవర్ ఎం.సుబ్బయ్య కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన తల్లి హజరత్తమ్మ (70) నెలలో రెండుసార్లు రంగనాయకులస్వామి గుడికి వెళ్లేది. ఈ నేపథ్యంలో ఆమె ఆదివారం ఉదయం గుడికి వచ్చింది. గోశాలలో మేత వేసిన అనంతరం గుడి వెనుకవైపు ఉన్న స్నానాల ఘాట్ వద్దకు వెళ్లింది. ఘాట్ మెట్లపై సెల్‌ఫోన్ పెట్టి స్నానం చేసేందుకు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగి చనిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి సెల్‌ఫోన్ ఆధారంగా బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. పెన్నానదిలో సుడిగుండాలు ఉన్నాయని నదిలోకి ఎవరూ దిగరాదని పోలీసులు, ఆలయ సిబ్బంది తెలిపారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఒకటో యూనిట్లో 425 మెగావాట్లు, రెండులో 420 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక కారణాలతో మూడో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశామన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం సోమవారం నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, కౌన్సెలింగ్ కన్వీనర్ సుధాకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ కావలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, నెల్లూరులోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతుందన్నారు. ఎస్టీ విద్యార్థులు నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. తొలిరోజు ఒకటి నుంచి 12 వేల ర్యాంక్ వరకు, 30న 12,001 నుంచి 28 వేల వరకు, 31న 28,001 నుంచి 43 వేల వరకు, జూన్ 1న 43,001 నుంచి 58 వేల వరకు, 2న 58,001 నుంచి 74 వేల వరకు, 3న 74,001 నుంచి 91 వేల వరకు, 4న 91,001 నుంచి 1,08,000 వేల వరకు, 5న 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఫీజు రసీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి హాల్‌టికెట్, మార్కుల జాబితా, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, కుల ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు. పీహెచ్, ఎన్‌సీసీ, క్యాప్, స్పోర్ట్స్, మైనార్టీ, ఆంగ్లో ఇండియన్ కోటాలో చేరాలనుకునే వారు వచ్చేనెల 2వ తేదీ నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలియజేశారు.

ప్రాణధాన్యాలు

తృణధాన్యాలతో ఆరోగ్య సిరులు



- చిరుధాన్యాలకు పెరుగుతున్న ఆదరణ
- ఐఐఎంఆర్ నుంచి నాణ్యమైన విత్తనం
- ఆహారంపై అవగాహనతో ప్రజల మెనూలో మార్పు
- తక్కువ ఖర్చుతో రైతులకు ఆదాయం

ఉరుకులు పరుగుల జీవితం. మారిన ఆహారపు అలవాట్లు. కూర్చొన్న చోట నుంచి కదలకుండా చేసే ఉద్యోగాలతో ఊబకాయం, అనారోగ్య సమస్యలు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. తృణధాన్యాల్లోనే ఆరోగ్యం ఉందని వైద్యుల సూచనలతో రోజు వారీగా తీసుకునే ఆహారాల్లో మార్పులు చేసుకుంటున్నారు. చిరుధాన్యాల వాడకానికి ప్రాముఖ్యత పెరిగింది. మార్కెట్‌లో తృణధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా రైతులు సైతం వీటిని పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చిరుధాన్యాలు, సేంద్రియ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



సాక్షి, నెల్లూరు డెస్క్: నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. ఆహారపు అలవాట్లను కూడా మార్చేసింది. రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు తృణధాన్యాలనే ఆహారంగా తీసుకున్న ఆ తరం ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంది. నేటి తరం ఆహార అలవాట్లతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటోంది. దీంతో ప్రజలు మళ్లీ తృణధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, ఊదలు, సామలు, జొన్నలు. వీటిలో ఉండే పీచు పదార్థం వల్ల తిన్న వెంటనే గ్లూకోజ్‌గా మారకుండా కొద్ది కొద్దిగా అవసరమైనంత మేరకు మాత్రమే రక్తంలో కలుస్తుంది. ఇవి తిన్న పూర్వీకులు నిండు నూరేళ్ల సంపూర్ణ ఆయుష్షుతో బతికారు.

వ్యవసాయ విప్లవంతో..

తృణధాన్యాలను భారతదేశంలో అనేక శతాబ్దాలుగా సాగు చేస్తున్నారని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇవి తక్కువ కాల వ్యవధి పంటలు. విత్తిన రెండు, మూడు నెలలకు దిగుబడులు వస్తాయి. ఒకసారి తగినంత వర్షం కురిస్తే చాలు పంట చేతికి వచ్చినట్లే. జిల్లాలో కూడా అత్యధిక విస్తీర్ణంలో సాగుతోపాటు వాటినే ప్రజలు ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. దేశంలో 1960–70 దశకంలో వ్యవసాయ విప్లవం (గ్రీన్ రివల్యూషన్) వచ్చింది. సాగునీటి ప్రాజెక్టులు విరివిగా చేపట్టడంతో తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు పొందే పంటలు సాగు చేయడం ప్రారంభమైంది. ముఖ్యంగా వరి, గోధుమ, చెరకు పంటల సాగు విపరీతంగా పెరిగింది. ఇవే ప్రధాన ఆహారంగా మారిపోయాయి. ఇంకా కాఫీ, టీలకు ప్రజలకు అలవాటు పడ్డారు. ఏళ్లపాటు వీటిని తీసుకుంటున్న ప్రజలు షుగర్, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని వైద్య పరిశోధనల్లో వెల్లడవుతోంది. దీంతో ప్రజల్లో ఆరోగ్యంపై ఆలోచన ప్రారంభమైంది. తాము తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు. తృణ/చిరుధాన్యాలకు పెద్దపీట వేస్తున్నారు.

ఇవీ కారణాలు

తృణ/చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్ ఖాదర్‌వలీ, ప్రకృతి వనం ప్రసాద్ వంటి వారు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రజల్లో కూడా విద్యావంతులు ఎక్కువగా ఉండటంతో ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని మేలైన ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. పోషక విలువలు, కేలరీల పరంగా



మెనూలో మార్పులు చేసుకుంటున్నారు. తృణధాన్యాల్లో కార్బోహైడ్రేట్స్‌తోపాటు ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్, పీచు పదార్థం ఉంటాయి. పీచుపదార్థం కారణంగా మనం తీసుకున్న ఆహారంలో నుంచి గ్లూకోజ్‌ను ఒకేసారి కాకుండా తగినంత మోతాదులోనే రక్తంలో కలిసేలా చేస్తుంది. అంటే రక్తంలో ఒకేసారి పెద్దమొత్తంలో గ్లూకోజ్ చేరనీయదు కాబట్టి షుగర్, బీపీ రానీయదు. షుగర్ అదుపులో ఉంటుంది కాబట్టి ఊబకాయం రాదు. అందుకే ప్రజలు తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

లాభదాయకం

చిరుధాన్యాల సాగు ప్రస్తుతం అన్నదాతలకు లాభదాయకంగా ఉంది. హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్) నాణ్యమైన చిరుధాన్యాల సీడ్‌ను రైతులకు విక్రయిస్తోంది. జిల్లాలో కొందరు రైతులు వాటిని కొనుగోలు చేసి విత్తుకుంటున్నారు. దిగుబడులు రాగానే వాటిని మార్కెట్‌లో విక్రయించుకుని లాభాలు పొందుతున్నారు. అధిక మొత్తంలో హైదరాబాద్ నుంచి సీడ్ తెచ్చుకున్న కొందరు వాటిని బైబ్యాక్ ఒప్పందంలో రైతులకు ఇచ్చి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో తృణధాన్యాలను సుమారు 2,500 దాదాపు ఆరువేలకు పైగా ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో విత్తనం నాటిన తర్వాత మోస్తరు వర్షం కురిసినా పంట చేతికి వస్తుంది. వీటి పంట కాల పరిమితి రెండు, మూడు నెలలే కావడంతో స్వల్ప వ్యవధిలోనే రైతు ఇంటికి ధాన్యం చేరుతుంది. చీడపీడలు ఆశించడం కూడా తక్కువే. మళ్లీ రెండో పంట సాగు చేసుకోవడానికి కూడా వీలుగా ఉంటుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో సజ్జ 5,420 ఎకరాల్లో, జొన్న 1,400, రాగులు 90, కొర్రలు 40 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఒక ఎకరానికి జొన్నలు 10 నుంచి 12 క్వింటాళ్లు, కొర్రలు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సజ్జలు కూడా దిగుబడి బాగానే వస్తుంది. మార్కెట్‌లో వీటికి క్రమక్రమంగా డిమాండ్ పెరుగుతున్నందున రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు.



జొన్నలు, సజ్జలు, రాగులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో..

సాగు :	రైతులు : సుమారు
6,950 ఎకరాల్లో	2,500 మంది

వీటికి డిమాండ్

సిరి ధాన్యాలుగా పిలిచే తృణధాన్యాలు మార్కెట్‌లో మంచి రేటు పలుకుతున్నాయి. ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు వస్తుండడంతో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. మార్కెట్‌లో అండుకొర్రల ధర కిలో రూ. 55 వరకు ఉంది. కొర్రలు రూ.32, అరికెలు రూ.30 ధర పలుకుతున్నాయి. కొందరు వ్యాపారులు తృణధాన్యాలను రైతుల నుంచి కొనుగోలు చేసి జల్లెడ పట్టి గ్రేడింగ్ చేసి వ్యాక్యూమ్ ప్యాకెట్లలో నింపి మార్కెట్ చేస్తున్నారు. తృణధాన్యాల్లో ఉండే పీచుపదార్థం గ్లూకోజ్‌ను అవసరమైన మేరకే రక్తంలోకి పంపి షుగర్ వ్యాధి బారిన పడకుండా చేస్తుంది. అండుకొర్రల్లో 12 శాతం వరకు పీచుపదార్థం ఉంటుంది. మిగిలిన వాటిలో కూడా 8 నుంచి 10 శాతం వరకు పీచు పదార్థం ఉంటుంది.

ఐదు సంవత్సరాలుగా..



నేను ఐదేళ్లుగా తృణధాన్యాలైన కొర్రలు, జొన్నలు తదితర వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలను తీసుకుంటున్నాను. రైస్‌లో షుగర్ అధికంగా ఉంటుంది. తృణ ధాన్యాల ఆహారం తీసుకోవడంతోపాటు రోజూ వాకింగ్ చేస్తున్నాను. ఫలితంగా బీపీ సమస్య తగ్గిపోయింది. మాత్రలు కూడా వేసుకోవడం లేదు.
– జి.మాల్యాద్రి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, తెలుగుగంగ కాలనీ

పౌష్టికాహారం లభిస్తుంది



తృణధాన్యాలతో ఎంతో పౌష్టికాహారం లభిస్తుంది. ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. నేను ఇప్పుడు తృణధాన్యాలనే ఆహార పదార్థాలుగా తీసుకుంటున్నాను. ఇవి రుచిగా ఉంటాయి. గతంలో కన్నా ఎంతో యాక్టివ్‌గా ఉన్నాను.
– నారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ముత్యాలపాళెం

సహకారం అందిస్తున్నాం



చిరుధాన్యాలను రైతులు ఎంతో ఉత్సాహంగా సాగు చేస్తున్నారు. కరోనా తర్వాత చిరుధాన్యాలకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో చిరుధాన్యాలు సాగు చేసే అన్నదాతలకు సహాయ సహకారాలు అందిస్తున్నాం.
– నర్సోజీ, ఏడీ, వ్యవసాయ శాఖ

సాగు బాగుంది



చిరుధాన్యాల సాగు గతంలో కంటే ప్రస్తుతం బాగుంది. ఇప్పుడు బాగా ఆదరణ లభిస్తోంది. రైతులు లాభాలు చూస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.
– సి.వెంకటేశ్వర్లురెడ్డి, దూబగుంట

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- సర్వేపల్లి నియోజకవర్గంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- భారీ ర్యాలీ.. వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- సర్వేపల్లి ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తానని మంత్రి వెల్లడి



సభలో మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన సందర్భంగా వెంకటాచలం మండలం సర్వేపల్లిలో ఆదివారం సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహించారు. తొలుత ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు తదితరులు వేలాదిగా పాల్గొని మంత్రి వెంట నడిచారు. ర్యాలీ మధ్యలో గజమాలతో కాకాణిని సన్మానించారు. యువత కేరింతలతో గంటసేపటికి పైగా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అనంతరం సభా వేదిక వద్దకు మంత్రి చేరుకుని ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు.

ప్రతి కుటుంబానికి..

సభలో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెన్షన్ నగదును అర్హులకు రూ.2 వేలు ఇస్తామని చెప్పడంతో చంద్రబాబు ఎన్నికలకు మూడు నెలలు ఉందన్న సమయంలో రూ.1,000 పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఓట్ల కోసం పెన్షన్ నగదును పెంచాడే తప్ప, ప్రజలపై ప్రేమతో కాదన్నారు. కానీ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఎవరి ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు.

సర్వేపల్లి అభివృద్ధికి కృషి చేస్తున్నా

సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని మంత్రి కాకాణి చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందని స్పష్టం చేశారు. తనకు ఓట్లు వేసి గెలిపిస్తే గ్రామాల్లో మట్టి రోడ్డు లేకుండా సిమెంట్ రోడ్డు వేస్తానని చెప్పినట్లు గుర్తు చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.365 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశామన్నారు. ఇడిమేపల్లి, రామదాసుండ్రిగ గ్రామాల్లో ఏళ్లుగా సాగునీటి కష్టాలు పడుతుంటే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయనన్ని అభివృద్ధి పనులు చేశామంటే ఆ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే ఆలోచనతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సంవత్సరంపాటు సాగిన ఈ కార్యక్రమంలో 89 గ్రామ సచివాలయాల పరిధిలో 195 రోజులపాటు 90 వేలకు పైగా కుటుంబాలను కలిశామన్నారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు, ప్రజలు, అధికారులు, వలంటీర్ల సహకారంతో విజయవంతంగా పూర్తి చేశామన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కాకాణి

పరిష్కరించాం

గ్రామాల్లో 4,257 అర్జీలను ప్రజలు ఇవ్వగా వాటిలో 2,654 అర్జీలను పరిష్కరించామని మంత్రి వెల్లడించారు. 1,354 పెండింగ్‌లో ఉన్నాయని, 249 అర్జీలు వివిధ సాంకేతిక కారణాలతో పరిష్కారానికి వీలు లేదని ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

- ఈ సందర్భంగా సర్వేపల్లిలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను మంత్రి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, గోగినేని గోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభకు హాజరైన జనసందోహం

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

- నేరస్తులకు శిక్ష పడేలా సమగ్ర విచారణ
- గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు



ఐజీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గూడూరు సీఐ సుబ్బారావు

నెల్లూరు(క్రైమ్): 'మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా తప్పిపోయిన వారిని గుర్తించి కుటుంబసభ్యుల చెంతకు చేర్చాలి.' గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నెల వారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. ఐజీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జిల్లా భౌగోళిక స్థితిగతులు, స్టేషన్‌లు, సిబ్బంది వివరాలు, వారి పనితీరు, పెండింగ్ కేసులు ఇలా అనేక విషయాలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. కేసుల ఛేదన, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సున్నితమైన భాషతో మాట్లాడాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించి తామున్నది వారి కోసమేనన్న నమ్మకం కలిగించాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించి ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేసి వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రేవ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలను కట్టడి చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరితగతిన పట్టుకుని దొంగలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సాధ్యమైనంత మేర నేరాలను కట్టడి చేయొచ్చని ఫలితంగా క్రైమ్‌రేట్ తగ్గే అవకాశం ఉంటుందన్నారు. కేసుల నమోదు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వరకు లోతుగా దర్యాప్తు చేయాలని, కోర్టులో అభియోగపత్రాలు వీలైనంత వేగంగా దాఖలు చేసి నేరస్తులకు శిక్షలుపడేలా చూడాలని సూచించారు.

కేసులు ఛేదించాలి

ఎస్పీ మాట్లాడుతూ ఐజీ సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు చేరువయ్యేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పని చేసి సత్ఫలితాలు సాధిస్తామన్నారు. అధికారులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేసులను ఛేదించాలన్నారు. ప్రతి శుక్ర, శనివారాల్లో విధిగా ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగంగా మద్యం తాగడంపై స్పెషల్ డ్రైవ్ చేయాలన్నారు. సెబ్ అధికారులను సమన్వయం చేసుకుని మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. అనంతరం గతనెలలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ఐజీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారానికి 42. 275 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 183 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. నీటి మట్టం 94.695 మీటర్లు ఉంది.

క్లుప్తంగా

నేలరాలిన మామిడి

- ఉలవపాడులో ఈదురుగాలులు, భారీ వర్షం



చెట్టు నుంచి రాలిన మామిడి కాయలు

ఉలవపాడు: మండల పరిధిలో శనివారం అర్ధ రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు మామిడి పంట దెబ్బతింది. శనివారం రాత్రి 9 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి ఒంటిగంట వరకు కురుస్తూనే ఉంది. గాలులు బలంగా వీచాయి. జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన మామిడి దుకాణాల రేకులు ఎగిరిపోయాయి. మామిడి తోటల్లో ప్రతి చెట్టు నుంచి 50 నుంచి 100 కాయల వరకు రాలి పడిపోయాయి. ఈ గాలుల వల్ల మామిడి రైతుకు భారీగా నష్టం వాటిల్లింది. కొమ్మలు సైతం విరిగి పడిపోయాయి. దీనికితోడు కాయలు వర్షానికి తడవడంతో తరువాత కూడా నాణ్యత తగ్గి రేట్లు పడిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఉలవపాడు ఉద్యానశాఖ పరిధిలో దాదాపు 10 వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక పలుమార్లు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం ఏ తోటలో చూసినా రాలిన మామిడి కాయలే కనిపించాయి.

సముద్రంలో మునిగి యువకుడి మృతి



అఖిలేష్ మృతదేహం

అల్లూరు: కుటుంబంతో కలిసి సరదాగా సముద్ర తీరానికి వెళ్లిన యువకుడు సముద్రంలో మునిగిపోయి మృతిచెందిన ఘటన తాటిచెట్ల పాళెం తీరంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుండాల మ్మపాళేనికి చెందిన డి.అఖిలేష్(13) కుటుంబసభ్యులతో కలిసి జువ్వలదిన్నెలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లాడు. కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి తాటిచెట్లపాళెం తీరానికి వచ్చి సముద్ర స్నానానికి వెళ్లాడు. తీరంలో ఒక్కసారిగా అలలు రావడంతో అఖిలేష్ చిన్న గుంతలో ఇరుక్కుపోయి సముద్రపునీరు, ఇసుకను మింగేసి ప్రాణాపాయస్థితికి చేరుకున్నాడు. తండ్రి డి.వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు హుటాహుటినా అఖిలేష్‌ను చికిత్సనిమిత్తం అల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

108లో కవలల ప్రసవం



కవలలను తల్లికి చూపుతున్న 108 సిబ్బంది

రాపూరు: మండలంలోని పెనుబర్తికి చెందిన మహిళ ఆదివారం 108లో కవలలను ప్రసవించింది. 108 సిబ్బంది నవీన, అబ్దుల్ ఖాదిర్ కథనం మేరకు.. మహాలక్ష్మి అనే గర్భిణికి 7వ నెలలో పురిటి నొప్పులు వచ్చాయి. దీనిపై సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే గ్రామానికి చేరుకుని గర్భిణిని రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహనంలోనే ప్రసవం చేశారు. జన్మించిన మగ శిశువులు బరువు తక్కువగా ఉండడంతో నెల్లూరులోని చిన్నపిల్లల వైద్యశాలకు తరలించారు. సకాలంలో స్పందించి నేర్పుగా కాన్పు చేసిన 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 155
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 262
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 292
లేయర్ చికెన్	: 167



నిమ్మ ధరలు

పెద్దవి	: రూ. 50
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ. 15



ఫోన్ పోయిందా.. మొబైల్ హంట్ ఉందిగా!

గతంలో మీ సెల్‌ఫోన్ పోతే ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళితే కొందరు ఫిర్యాదు తీసుకునే వారు కాదు. వేల రూపాయలు వెచ్చించి కొన్న ఫోన్, అందులో ఉన్న విలువైన సమాచారం పోయిందని బాధపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేదు. మీరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరమే లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన జిల్లాలో మొబైల్ హంట్ సేవలను ప్రారంభించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను దీని ద్వారా త్వరితగతిన గుర్తించి బాధితులకు అందజేస్తున్నారు.

- 9154305600కు మెసేజ్ పంపితే రంగంలోకి సిబ్బంది
- తక్షణ రికవరీకి చర్యలు
- రెండు విడతల్లో 416 మొబైల్స్ రికవరీ
- కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితులు



ఇటీవల స్వాధీనం చేసుకున్న ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి.

నెల్లూరు(క్రైమ్): పోగొట్టుకున్న మొబైల్స్‌ను పోలీసుశాఖ ప్రారంభించిన మొబైల్ హంట్ ద్వారా తిరిగి రికవరీ చేసుకునే అవకాశం లభించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొబైల్ హంట్‌కు 3,054 ఫిర్యాదులు అందాయి. అందులో 625 ఫిర్యాదుల్లో సరైన సమాచారం లేదు. మిగిలిన 2,429 ఫిర్యాదులు నమోదయ్యాయి. రంగంలోకి దిగిన సిబ్బంది రెండు విడతల్లో ఇప్పటివరకు రూ.90 లక్షల విలువ చేసే 416 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. దీంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఫిర్యాదు ఇలా..

సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు ముందుగా మొబైల్ హంట్ సెల్‌ఫోన్ నంబర్ 9154305600కు వాట్సాప్ ద్వారా 'హాయ్' అని మెసేజ్ పంపాలి. వెంటనే జిల్లా పోలీసు పేరున మీ వివరాల కోసం లింక్ వస్తుంది. దానిని క్లిక్ చేయాలి. ఆ లింక్‌లో గూగుల్ ఫాం ఓపెన్ చేసి ఫిర్యాదుదారుని పేరు, చిరునామా, చోరీ/పోయిన తేదీ, సమయం, మొబైల్ పోయిన స్థలం, ఫోన్ మోడల్, కంపెనీ, రంగు, ఐఎంఈఐ నంబర్, ఈ–మెయిల్ ఐడీ, ఫిర్యాదుదారుని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం, పోయిన ఫోన్‌లో ఉపయోగించిన నంబర్, సమాచారం కోసం మరో ఫోన్ నంబర్, పోలీస్‌స్టేషన్ పరిధి తదితర వివరాలను నమోదు చేసిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది. సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం వారి వద్దనున్న సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ను ట్రేస్ చేస్తారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే పోయిన ఫోన్‌ను గుర్తించి అందజేస్తారు.

సేవలను వినియోగించుకోవాలి



రోజువారీ జీవితంలో సెల్‌ఫోన్ ప్రముఖ పాత్ర వహిస్తోంది. వృత్తిరీత్యా, వ్యక్తిగత పనుల్లో పడి సెల్‌ఫోన్‌ను మరిచిపోవడం, పోగొట్టుకోవడం జరుగుతోంది. అందులోని విలువైన సమాచారం, వ్యక్తిగత, కుటుంబసభ్యుల ఫొటోలు. వీడియోలు లాంటి డేటా అసాంఘిక వ్యక్తుల చేతిలో పడితే అది మరింత ప్రమాదం. దీనిని దృష్టిలో ఉంచుకునే మొబైల్ హంట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాం. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను దీని ద్వారా గుర్తించి బాధితులకు అందజేస్తున్నాం. మొబైల్ హంట్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలి. మార్కెట్‌లో తక్కువ రేటుకు వస్తున్నాయని.. బిల్లులు లేకుండా సెకండ్‌హ్యాండ్ ఫోన్లను కొనవద్దు.

– డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

దొరకదేమోనని బాధపడ్డా



నేను బైక్‌లో ఫోన్ పెట్టి మరిచిపోయి ఇంట్లోకి వెళ్లిపోయా. కిందకు వచ్చి చూస్తే ఫోన్ కనిపించలేదు. దొరకదేమోనని బాధపడ్డా. స్నేహితుల ద్వారా మొబైల్ హంట్ గురించి తెలుసుకుని 9154305600 వాట్సాప్ నంబర్‌కు వివరాలు పంపాను. పోలీసులే ఫోన్ చేసి 'మీ ఫోన్ దొరికింది.. వచ్చి తీసుకెళ్లండి' అని చెప్పారు. శనివారం ఎస్పీ చేతులమీదుగా నా ఫోన్‌ను అందుకున్నాను. జిల్లా పోలీసుశాఖకు కృతజ్ఞతలు.

– సాయికృష్ణ, నెల్లూరు

వెంకటేశ్వర కళాశాలకు 'అసోచామ్' అవార్డు



అసోచామ్ అవార్డు అందుకొంటున్న కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు ప్రముఖ భారతీయ సంస్థ అసోచామ్(అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫర్ ఇండియా) అవార్డు లభించింది. అసోచామ్ నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ విభాగం ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన 16వ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్ సదస్సులో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును బహూకరించింది. యువత విద్యావికాసం, ఉద్యోగాల కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో గత 12 సంవత్సరాలుగా జిల్లాలో అగ్రగామిగా ఉన్న క్రమంలో కళాశాలకు ఈ అవార్డును బహూకరించారు. కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి శ్రీరాజ్ కుమార్ రంజన్‌సింగ్, అసోచామ్ చైర్మన్ కున్వర్ శేఖర్ విజేంద్ర, సహాయ చైర్మన్ రజిత కులకర్ణి చేతులమీదుగా కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్ బాబు, డైరెక్టర్ పి.కృష్ణచైతన్య ఈ అవార్డును అందుకున్నారు. అత్యున్నత అసోచామ్ 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు తమ కళాశాలకు దక్కడం ఎంతో ఆనందాన్నిచ్చిందని కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు ఈ సందర్భంగా ఆదివారం తెలిపారు.

నాడు ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించిన చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రేమ కురిపిస్తున్నాడు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: నాడు ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించిన చంద్రబాబు ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయనపై ప్రేమలు కురిపిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాజమహేంద్రవరంలో చంద్రబాబు నాయకత్వంలో ఆ పార్టీ నేతలు డ్రామాలు, వేషాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. అప్పట్లో ఎన్టీఆర్‌పై వైస్రాయ్ హోటల్లో చెప్పులు వేసి, ముఖ్యమంత్రి పదవి నుంచి దించి మానసికంగా హత్య చేశారన్నారు. ఎన్టీఆర్‌ను సీఎం పదవి నుంచి దించడంలో కథ, దర్శకత్వం అంతా రామోజీరావుదేనని పేర్కొన్నారు. అప్పట్లో నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యేలంతా చంద్రబాబుకు అమ్ముడుపోయారని, తానొక్కడినే ఎన్టీఆర్ వెంట ఉన్నానని తెలిపారు. కనీసం సభ్యత్వ పుస్తకాల్లో కూడా ఎన్టీఆర్ ఫొటో తీయించిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. ఎన్టీఆర్‌ను మానసికంగా వేధించిన వారు రాజమహేంద్రవరంలో ఆయన జపం చేస్తున్నారని, రామోజీ, రాధాకృష్ణ, చంద్రబాబు, లోకేష్‌లకు ఎన్టీఆర్ పేరును ప్రస్తావించే అర్హత లేదని అన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. ఎన్టీఆర్ ఫొటోలు పెట్టినా చంద్రబాబును ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీడీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మీ ఆదరాభిమానాలను మరవలేను'



సినీ నటుడు సుమన్‌ను సత్కరిస్తున్న డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ సభ్యులు

- సినీ నటుడు సుమన్‌కు ఆత్మీయ సన్మానం

నెల్లూరు(బృందావనం): తాను 10 భాషల్లో సినీ నటుడిగా రాణిస్తున్నానంటే అందుకు తల్లిదండ్రులు, భగవంతుడి ఆశీస్సులు, అభిమానుల ఆదరాభిమానాలే కారణమని ప్రముఖ సినీ నటుడు సుమన్ తెలిపారు. హీరో సుమన్ 45 సంవత్సరాల సినీప్రస్థానాన్ని పురస్కరించుకుని బాబు కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్యాన్స్‌డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ అధినేత, కొరియోగ్రాఫర్ ఎస్‌కే బాబు నేతృత్వంలో ఆదివారం నటుడు సుమన్‌కు వీఆర్సీసెంటర్ వద్ద ఉన్న ప్రిన్సెస్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సినీప్రస్థానాన్ని వివరించారు. తాను ఊహించకుండా సినిమాల్లోకి వచ్చానని, తొలినాళ్లలో డ్యాన్స్ మాస్టర్లు సుందరం, సలీం, తంగప్ప తదితరులతోపాటు డైరెక్టర్లు, నిర్మాతలు అందించిన సహాయ సహకారాలతో తాను నటుడిని కాగలిగానని తెలిపారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. నెల్లూరులో చిన్నారులు ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్‌లు, సినీనృత్యాలు ఎంతో బాగున్నాయన్నారు. 45 ఏళ్ల క్రితం రామారావు అనే అభిమాని తన తొలి అభిమానిగా నెల్లూరు నుంచే ఉండేవారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తనకు తోబుట్టువులు లేరని, అభిమానులే తోబుట్టువులని తెలిపారు. సమాజంలో అందరూ బాగుండాలని, ప్రేక్షకుల ఆశీర్వచనాలు తనకు ఎప్పుడూ ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలు, సంస్థలకు చెందిన అందె శ్రీనివాసులు, పేరూరి ప్రదీప్, కాసా వరప్రసాద్‌నాయుడు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. నటుడు సుమన్ పద్మశ్రీ అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు డ్యాన్స్ మాస్టర్లను, నాట్య గురువులను సుమన్ సత్కరించారు.

'అపోలో'లో రోబోటిక్ నీ సర్జరీలు సక్సెస్

నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీలు ఎక్కడా లేనివిధంగా విజయవంతం చేస్తున్నామని ఆస్పత్రి ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన నెల్లూరులోని హరనాథపురంలో ఉన్న అపోలో ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక్క రోజే 13 మందికి రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాలి కీళ్ల మార్పిడి విజయవంతం చేశామని, ఇది అరుదైన రికార్డు అని పేర్కొన్నారు. మహా నగరాలకే పరిమితమైన మోకాళ్ల కీళ్ల మార్పిడి, రోబోటిక్ సర్జరీలు నెల్లూరులోని అపోలోలో ప్రవేశపెట్టిన ఘనత తమదేనన్నారు. రోబోటిక్ సర్జరీలో ముందుగా కంప్యూటర్‌లో త్రీడీ నమూనాను రూపొందించుకొని సిటీ స్కాన్ ఆధారంగా రోబోటిక్ ఆర్మ్‌డ్ అసిస్టెంట్ టెక్నాలజీ ద్వారా ఆపరేషన్‌ను సక్సెస్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ షాహుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు





నెల్లూరు కేవీఆర్‌నగర్ ప్రాంతంలో వీధి కుక్కలను పట్టుకుని యాంటీ ర్యాబిస్ టీకా వేస్తున్న సిబ్బంది

కుక్కల స్వైరవిహారానికి అడ్డుకట్ట

ఇటీవల నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల స్వైరవిహారం చేశాయి. దీంతో నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయన ఆదేశాల మేరకు ఆ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకా వేసి వదిలేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు